# AIIMS Bibinagar to build mini AIIMS in Bommalaramaram

## బొమ్మలరామారంలో మినీ ఎయిమ్స్

- 6 ఎకరాలు ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం..
- రూ.10 కోట్లతో ఆసుపత్రి నిర్మాణానికి బీబీనగర్ ఎయిమ్స్ చర్యలు

బీబీనగర్, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రజలకు వైద్య సేవలను విస్తరించేందుకు యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారంలో మినీ ఎయిమ్స్ నిర్మాణానికి బీబీనగర్ ఎయిమ్స్ చర్యలు చేపట్టింది. ఇప్పటికే బొమ్మలరామారం పీహెచ్‌సీలో 'గ్రామీణ ఆరోగ్య కేంద్రం' ఏర్పాటు చేసి స్పెషాలిటీ వైద్య నిపుణులతో సేవలు అందిస్తున్న ఎయిమ్స్.. తాజాగా 6 ఎకరాల్లో రూ.10 కోట్లతో మినీ ఎయిమ్స్‌ను నిర్మించబోతోంది. దీంతో బొమ్మలరామారం, తుర్కపల్లి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని కీసర, శామీర్‌పేట్ మండలాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.

### 10 ఎకరాలు కోరిన ఎయిమ్స్..

అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్)లు.. తమ పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో ఒకచోట చిన్న వైద్య కేంద్రం ఏర్పాటుకు అవకాశం ఉంది. దీంతో

బొమ్మలరామారం మండలంలో మినీ ఎయిమ్స్ ఏర్పాటుకు 10 ఎకరాలు కేటాయించాలని 2021లో బీబీనగర్ ఎయిమ్స్ డైరెక్టర్ భాటియా తెలంగాణ ప్రభుత్వానికి ప్రతిపాదన పంపారు. దీనిని పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం గతేడాది డిసెంబరులో మండలంలోని మల్యాల గ్రామపంచాయతీ పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం పక్కన సర్వే నంబర్ 199లో 6 ఎకరాలు కేటాయించింది. ఇందులో మినీ ఎయిమ్స్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం గత నెలలో అనుమతి ఇవ్వడంతో ఆ సంస్థ నిర్మాణ ప్రణాళికలు రూపొందిస్తోంది. ఎయిమ్స్ బడ్జెట్ నుంచి రూ.10 కోట్లు కేటాయించి.. రెండేళ్లలో ఆసుపత్రి నిర్మాణ పనులు పూర్తిచేసేందుకు సంస్థ సన్నాహాలు చేస్తోంది.



బీబీనగర్ ఎయిమ్స్ ఆసుపత్రి

### శాశ్వత సేవలు కొనసాగించాలని..



'గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు బొమ్మలరామారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఓ గదిలో రూరల్ హెల్త్ కేర్ సెంటర్ ఏర్పాటు చేశాం. అక్కడ శాశ్వతంగా ఎయిమ్స్ సేవలు కొనసాగిస్తామని ప్రతిపాదించగా.. ప్రభుత్వం ఆరు ఎకరాలు అప్పగించింది. అందులో మినీ ఎయిమ్స్ పేరుతో హెల్త్‌కేర్ సెంటర్ నిర్మాణం చేపట్టబోతున్నాం. అక్కడికి వచ్చే రోగులకు అత్యవసర చికిత్సలు అవసరమైతే.. బీబీనగర్ ఎయిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తాం' అని వికాస్ భాటియా తెలిపారు.